# మెడికల్ రిపోర్ట్స్

నండూరి సుబ్బారావు



"అదే అమ్మడూ. ఇక నీ మాంగల్యాన్ని ఎలా కాపాడుకుంటావో. పైన భగవంతుడున్నాడు. క్రింద నీవున్నావు. మధ్య బావున్నాడు" అని హైడ్రోజన్ బాంబు లాంటిది చెల్లెలు నళిని చెవిలో వేసి లేచి నిలబడ్డాడు వీర వెంకట వరప్రసాదు... వెళ్తూ వెళ్తూ ఒక క్వార్టరు బాటిల్ జేబులో పెట్టుకుని రెండు క్వార్టర్సు చేతి సంచిలో వేసుకుని తూలుతూ తూలుతూ తన ఊరు వెళ్ళిపోయాడు.

వార్త విన్న నళిని కరెంటు షాకు తిన్నట్టు నవనాడులూ బిగదీసుకుపోయి ఎలాగోలా లోపలికి పోయి గంగానమ్మకు చద్ది నైవేద్యం పెడతానని మొక్కుకుంది. నిగనిగలాడుతున్న తన కురులలో నుంచి రెండు వెంట్రుకలు కత్తిరించి తీసి వెంకటేశ్వరస్వామికి ఎడ్వాన్సుగా యిచ్చి భర్త ఆరోగ్యం సరిగా ఉంటే మిగతా జుట్టు, కొండకొచ్చి సమర్పించుకుంటానని ప్రామిస్ చేసింది.

ఈ రోజు తన భర్త సుబ్బారావు బర్త్‌డే కూడాను. "హాపీ బర్త్‌డే టు యూ" అని స్వాగతం చెపుతుందని కలలు గన్న సుబ్బారావుకు నిరాశే ఎదురయింది. 'ఏమోలే పిండి వంటలు చేయటంలో మరచిపోయి ఉంటుం'దని సరిపుచ్చుకున్నాడు సుబ్బారావు. ఆఫీసు పని ఎక్కువయి మధ్యాహ్నం ఒంటిగంట దాటి నీరసంగా అడుగులో అడుగువేసుకుంటూ, చెమటలు కక్కుకుంటూ యింటికి వచ్చాడు. బర్త్‌డే స్పెషల్సు - పిండి వంటలను - తలచుకుంటూ లోలోపల గుటకలు మింగుతున్నాడు, నళిని వంట ఇంట్లోనే ఉంది.

"ఏమోయి ఇవాళ శాకపాకాలేమిటి?" అంటూ కూనిరాగంలా, ఉత్సాహంగా అడిగాడు, ఏమేం పిండి వంటలు చేసిందో తెలుసుకునేందుకు. నళిని పమిట చెంగుతో ముక్కు తుడుచుకుని "గోధుమఅన్నం-కాకర కాయ కూర" అని చెబుతూ "ముందు ఇది తాగండి" అంటూ గిన్నెలో ఉన్నవి ముందుకు పెట్టింది.

"ఏమిటివి? కొబ్బరి నీళ్లా"?

"కాదు. మెంతుల కషాయం" అని చెప్తూనే ముఖం చాటు చేసుకుంది. సుబ్బారావు నవ్వుకుని "ఏమిటిది పుట్టినరోజు సరసమా?" అన్నాడు.

"ఇక నా బతుక్కి సరసాలేమిగిలాయి. భగవంతుడు దయ తలచి మీ ఆరోగ్యం కుదుటపడితే ముందు ముందు మీక్కావలసినవన్నీ చేసి పెడతా. అంతవరకూ మీకు గోధుమ అన్నం కాకరకాయ కూరా తప్పదు". అంది విచార వదనంతో.

"అదేమిటే ఇవాళ ఇలా తలపెట్టావూ? నాకు కాకరకాయ అసలు సహించదని నీకు తెలుసు. దానికి తోడు మెంతి కషాయం అనుపానమా? గోధుమ అన్నం ఏమిటి రోగిష్టి వాడికి పెట్టినట్లు? ఎంచక్కా బంగాళా దుంపల వేపుడు, గడ్డపెరుగు, ఆవకాయ, మామిడి పండు వేసి అన్నం పెడతావని నేనొస్తే" అన్నాడు అర్థోక్తిగా.

"ఇక ఆ పప్పులేం ఉడకవు. నా మంగళసూత్రం బాగుండాలంటే ఇక నుంచీ నేను పెట్టినట్లే తినాలి. మామిడి పళ్ళూ, అరటిపళ్లూ, స్వీట్లూ అసలు ముట్టుకోకూడదు. గడ్డపెరుగులూ, మీగడలు కలలో కూడా తలపెట్టకూడదుట".

"ఎందుకని? ఎవరు చెప్పారు నీకు"? డీలా ముఖంతో అడిగాడు సుబ్బారావు.

"ఎవరు చెపితే ఏం? డాక్టరుగారే చెప్పారు. సరేనా. మధుమేహం - అంటే షుగర్ వ్యాధి ఉన్నవాళ్లు ఇవేవీ దగ్గరకు రానీ కూడదట. షుగర్ ఎక్కువయి గుండె ఆగిపోతుందిట. పక్షవాతం వస్తుందట. అవునూ, మీ ఆఫీసులో ఎవరికో షుగర్ ఎక్కువయి కాళ్లు మోకాళ్ల వరకూ కత్తిరించేశారట నిజమేనా?" భయం భయంగా అడిగింది. సుబ్బారావు కుప్పకూలిపోయాడు. పెళ్లాం పనులు మొదట 'సరసం' అనుకున్నాడు కాని ఇప్పుడు ఇదంతా 'విరస' మే అని నిర్ధారణ చేసుకున్నాడు.

"ఎవరు చెప్పాడే ఈ ససోటా కబుర్లు, అంతా అబద్ధం, నాకేమిటి సుగర్ వ్యాధి ఏమిటి? పిడిరాయిలా నేనుంటే... చాలు చాలు గాని పుట్టిన రోజునాడు ఏడిపించక అన్నీ వడ్డించు" అని ఆజ్ఞలు జారీ చేశాడు.

నళినికి మళ్లా అన్నగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి. "అతను ఎంత గింజుకుని పెట్టమన్నా పెట్టకు. మంగళ సూత్రం జాగ్రత్త" అన్న మాటలు.

ఒక్కసారి మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుని "మీరు నన్ను చంపినా సరే నేను పెట్టను గాక పెట్టను. అంతే కాదు దుంపకూరలు, వంకాయ కూర, బెండకాయ, చిక్కుడు కాయ, గుమ్మడి కాయ, పనస కాయ లాంటివి కూడా ఏమీ ఇంటికి తీసుకురావద్దు" అని గట్టిగా చెప్పింది.

ఈ చెప్పిన వన్నీ సుబ్బారావుకు చాలా ఇష్టమయినవే. పులుసులో చిలగడ దుంప ముక్కలంటే ప్రాణం లేచొస్తుంది. అన్నిటికీ బాన్ పెడితే ఇక తను తిని చచ్చేదేముంది. సుబ్బారావు హతాశుడైపోయాడు.

"అవునూ. నెయ్యి, పెరుగు మీగడ నాకిష్టమని నీకు తెలుసు కదా" వాక్యం పూర్తి కాలేదు. నళిని అడ్డుపడి "అవన్నీ వద్దని చెప్పానా? అవి కొలస్ట్రాల్ పెంచుతాయట. ఆవకాయ, మాగాయ, ఉప్పుకారం బి.పి. పెంచుతాయట. ఇవేమీ వద్దుట. కావాలంటే తోటకూర ఉడకపెట్టి ఉప్పు వేయకుండా పెట్టమన్నారు. పెడతాను తినండి" అని చెప్పేసింది మంగళసూత్రాన్ని మనసులో పెట్టుకుని.

సుబ్బారావుకు ఒళ్లు మండిపోయింది. "అయితే ఒక పని చెయ్యి. చిటికెడు విషం ఉంటే అందులో వెయ్యి. నా పీడా నీ పీడా వదిలి పోతుంది" అంటూ బొబ్బలు

పెట్టాడు. ఏమయినా సరే నళిని మెట్టుకూడా దిగకుండా, ఇంకో మెట్టు కూడా పైకెక్కి ఆర్డర్లు జారీ చేసింది'' ఇవేవీ ఇంకతను పెట్ట''నని.

వారం రోజులు గడిచాయి. దబ్బపండులా ఉండే సుబ్బారావు నిమ్మపిండె అయిపోయాడు. ఎంత బతిమి లాడినా నళిని వినడం లేదు. రోజూ భోజనం దగ్గర రామరావణ యుద్ధమయిపోతోంది. "పోనీ ఆ చిక్కుడు కాయ గింజలు లేకుండా పై తొక్కలన్నా వెయ్యవే'' అని బతిమిలాడుకున్నాడు.

"అమ్మో! వాతం చేస్తుంది. నా వల్ల కాదు. అయినా అన్నిటికీ అంత జిహ్వాచాపల్యం ఏమిటి?. లేకితనం చూస్తే నలుగురూ నవ్వుతారు. ఏదో తిన్నన్ని రోజులు తిన్నారు. ఇక ఈ జన్మలో వాటికి నీళ్లొదులుకోండి. ఏదోలా బ్రతకడం అలవాటు చేసుకోండి'' అని వేదాంత ధోరణిలో మందలించింది.

సుబ్బారావుకు ఒక పక్క కోపం ఎక్కువయింది. "బతికినన్నాళ్లు బ్రతికాగా ఇక ఇప్పుడు చంపెయ్యరాదూ ... ఈ దిక్కుమాలిన బ్రతుకు బతక్కపోతే ఎవడేడిచాడు. ఛస్తేనే మంచిది'' అని విసుక్కున్నాడు నిరాశతో.

మరి నాలుగు రోజులు గడిచాయి. సుబ్బారావు కాకరకూరను కళ్లు మూసుకుని నోట్లోవేసుకుని చెంబెడు నీళ్లు తాగుతున్నాడు. నడిచే ఓపిక లేక కర్ర చేతికివచ్చింది. ఏయితేనేం తన మంగళ సూత్రం బాగుంటోందని నళిని సంతోషపడిపోతోంది. అనకూడదు గాని పిల్లికి చెలగాటం - ఎలక్కి ప్రాణసంకటంలా ఉంది సుబ్బారావు పరిస్థితి.

మరో వారం గడిచింది. ఒక రోజున సుబ్బారావు నీరసంగా పడక కుర్చీలో కళ్లు మూసుకుని పడుకుంటే మెట్ల దగ్గర ఏదో పెద్ద మూలుగు వినిపించింది. క్రమంగా మూలుగు తనకు దగ్గరవుతోంది. ఏపందికొక్కో, లేచి కొడదామనుకుంటే అతనికి లేచే ఓపిక లేదు. ఆ మూలుగు క్రమంగా దగ్గిరయి దగ్గిరయి హాల్లోకి చేరుకుంది. తీరా చూస్తే తన మామగారు పరంధామయ్య గారు జంపకానా పురుపు చుట్ట భుజాన వేసుకుని, చంకలో సంచీతో (సిమెంటు సంచీలో బట్టలు కుక్కి) మరో చంకలో గొడుగుతో మూలుగుతూ ప్రత్యక్ష మయ్యారు. సుబ్బారావు ఓపిక తెచ్చుకుని కుర్చీలోంచి లేచి మామగారి చేతిలో లగేజీ అందుకుని "ఏమేవ్ ఎవరొచ్చారో చూడు''అని దొడ్లో ఉన్న భార్య నుద్దేశించి నీరసంగా కేకేశాడు.

నళిని అతిధి మర్యాదలన్నీ చేసి " నీవంట్లో ఎలా ఉంది నాన్నా? అంతా బాగున్నారా'' అని కుశల ప్రశ్నలు వేసింది. పరంధామయ్య తాత్కాలికంగా మూలుగు ఆపి "ఏం కులాసా తల్లీ. నా ఆరోగ్యమే ఏమీ బాగుండటం లేదు. ఇక్కడ డాక్టరుకు చూపిద్దామని వచ్చా ... బలానికి డాక్టరు పళ్లూ పాలూ, తినమంటే రోజూ చక్రకేళీలూ, పంచదార బాగా వేసి బాగా పాలూ, ఆరగా ఆరగా తింటూనే ఉన్నా. ఏమీ తగ్గి చావటం లేదు. అది సరే గాని అమ్మా! నీ ఆరోగ్యం బాగుంటోందా. నీకున్న షుగర్ వ్యాధి కంట్రోల్లోకి వచ్చిందా?'' అని అడిగాడు.

నళిని తెల్లబోయి "అదేమిటి నాన్నా? నాకు షుగర్ వ్యాధేమిటి? ఆ షుగర్ మీ అల్లుడు గారికి'' అని చెప్పింది. దాంతో పరంధామయ్య చివ్వున లేచి "నీ బొందా నా బొందాను. అల్లుడి గారికి కాదు, నీకే! డాక్టరు రిపోర్టు తారుమారు చేయకు'' అన్నాడు బల్ల గుద్ది మరీ చెపుతూ.

కుర్చీలో కూర్చున సుబ్బారావుకు ఎక్కడ లేని ఓపికా వచ్చి చివాల్న లేచి "చూశారా చూశారా. తన దగ్గర షుగర్ వ్యాధి పెట్టుకుని నా ప్రాణం తీసి, నన్ను నిలువునా కాల్చుకు తింటోంది'' అని ఎగిరి పడ్డాడు.

"లేదు నాయనా. ఇన్నేళ్లొచ్చి నీతో అబద్ధమాడతానా. షుగర్ వ్యాధి దానికే ఉందనీ, గోధుమ అన్నం, కాకర కాయ కూరా బాగా తినమనీ దానికే, నీరసానికి పళ్లూ పాలూ బాగా వాడమనీ నాకు డాక్టర్ స్వయంగా చెప్తేనే' అని గట్టిగా అనేసరికి సుబ్బారావు సంతోషంతో కెవ్వున



"నా మనసు లోతుల్లోకి తొంగిచూడు దేవీ... నా ప్రేమ నీకు కనిపిస్తుంది !'' ప్రేమగా చెప్పాడు దేవ్.

"బాబోయ్... నాకు లోతుల్లోకి చూస్తే కళ్ళు తిరుగుతాయి !'' చెప్పింది దేవి.

- **అండే అనిత**, చిత్తూరు.

అరిచాడు. నళిని అరిచింది కెవ్వున. కానీ సంతోషంతో కాదు భయంతో విచారంతో.

ఆరోజు నుంచీ పరిస్థితులు మారిపోయాయి. గోధుమ అన్నం, కాకరకాయ కూర నళినికి ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. ఆ తర్వాత సుబ్బారావు మాత్రం అన్నీ తింటున్నాడు. వారం రోజులయ్యేసరికి సుబ్బారావు బాగా కోలుకున్నాడు గాని, నళిని మాత్రం మంచం దిగలేకపోతోంది. బాగా నీరసించిపోయింది. మామగార్కి పూట వారీ పళ్లూ, పాలూ, జీడిపప్పు, కిస్‌మిస్, బలానికి మందులూ తేలేక సుబ్బారావు అవస్థపడిపోతున్నాడు.

ఇలా కొద్ది రోజులు గడిచాయి. రాను రాను సుబ్బారావుకు ఈ ఇల్లు నరకప్రాయమయింది. ఇంట్లో హమేశా రెండు మంచాలు విడవకుండా నట్టింట వున్నాయి. ఒక మంచం మీద కాళ్లూ, చేతులూ లేపే శక్తి లేక వెల్లకిలా, శవాకారంలా పడివున్న నళిని, రెండో మంచం మీద అంపశయ్య మీద పడుకున్న భీష్ముల వారిలా మామగారూ. వీళ్లకు వండిపెట్టలేక, మందులు తీసుకు రాలేక తన చావు దగ్గరకొస్తోంది. ఇంతకంటె గోధుమ అన్నం,కాకరకూరే నయమేమో అనుకున్నాడు సుబ్బారావు.

"ఏవండీ. ఒక్కసారి నన్ను బాత్‌రూమ్‌కి తీసు కెళ్తారూ?'' అని నళిని,

"అల్లుడూ, నన్ను కొంచెం వత్తికించి పడుకోబెట్టు. పడుకుని పడుకుని పక్కలు పీక్కుపోతున్నాయి'' అని మామగారు. ఇలా ఇద్దరూ వంతుల వారీగా పిలిచి ప్రాణాలు కొరుక్కుతింటున్నారు సుబ్బారావుని.

"ఈ ముసిలాడు ఇక్కడికెందుకొచ్చినట్టు నా ప్రాణం తీయడానికి కాకపోతే. డబ్బుకు డబ్బు బోలెడయి పోతోంది. నా ప్రాణానికి సుఖం లేకుండా పోతోంది. చాకిరీ చెయ్యలేక'' అంటూ సుబ్బారావు గుడ్ల నీళ్లు గుడ్లను కుక్కుకుంటున్నాడు.

శనివారం. దుర్ముహూర్తం. నళిని, పరంధామయ్య ఇద్దరూ పంతం పట్టినట్లు ఒకళ్లు విడచి ఒకళ్లు ఆర్తనాదాలు మొదలు పెట్టారు. నళిని మంచానికి అతుక్కుపోయింది. పరంధామయ్య గుడ్లు తేలవేస్తున్నాడు. సుబ్బారావుకు భయం వేసింది. మాసిపోయిన పాంటు షర్టు అని ఆలోచించకుండా ఫామిలీ డాక్టర్ దగ్గరకి పరిగెట్టాడు. పాపం. డాక్టరు గారు ఏకళనున్నాడో, జపం కూడా చేసుకోకుండా గజేంద్ర మోక్షంలో విష్ణుమూర్తిలా పరిగెత్తు కొచ్చాడు. తీరా వచ్చి చూస్తే ఏముంది?! ప్రాణాలు పోయినంత పనయి తండ్రీ కూతుళ్లు చెరో మంచం మీదా పడున్నారు. డాక్టరుగారికి తనిచ్చిన మెడికల్ రిపోర్ట్స్ జ్ఞాపకం వచ్చినాయి. ఎందుకాయినా మంచిదని ఆ రిపోర్టులు ఒకసారి ఇవ్వమన్నారు. పరంధామయ్య తన సిమెంటు సంచీ లోంచి వాటిని తీసిఇచ్చాడు. వాటిని చూచి డాక్టర్ ఒక్కగావు కేక పెట్టి "ఆవిడకు షుగర్ వ్యాధనీ, మిమ్మల్ని పళ్లూ, పంచదారా తినమని ఎవరు చెప్పారు?'' అని అరిచాడు.

"మా అబ్బాయి వీర వెంకట వర ప్రసాదు'' అని పరంధామయ్య చెప్పాడు.

"చంపారు పొండి. చక్కెర వ్యాధి ఆవిడకు కాదు మహానుభావా, ఈ పరంధామయ్య గారికి. అందుకని గోధుమ అన్నం, కాకరకాయ ఈయన తినాలి. మిస్టర్ సుబ్బారావ్! నళినికి ఇప్పుడు నాలుగో మాసం. మీరు తండ్రి కాబోతున్నారు. అందుకని పళ్లూ పాలూ వంటి బలకరమైన ఆహారం తినమని చెప్తే, ఈయన పళ్లూ పాలూ మెక్కి, ఆవిడకు గోధుమ అన్నం, కాకరకాయ కూర పెట్టి ఆవిడ ప్రాణం తీయబోయాడు. మెడికల్ రిపోర్ట్స్ తారుమారయ్యాయి. ఇంకో రోజుంటే ఇద్దరి ప్రాణాలు దక్కేవి కావు. ఏమైతేనేం. అదృష్టవంతులు' అన్నాడు. "మరి మావాడు అలా చెప్పి చచ్చాడే!'' అన్నాడు పరంధామయ్య.

"తాగుబోతు వెధవ. వాడి మాటలకు విలువేమిటి? అది సరే ఇప్పుడేం చేద్దాం'' అన్నాడు సుబ్బారావు.

"ఏముందీ? ముందావిడకి పళ్లూ పాలూ ఇవ్వండి. ఇంతవరకూ పళ్లూ, పాలూ ఆరగించిన మీ మామగారిని ఒక లాగుడు బండి మీద వేసి హాస్పిటల్‌కు పంపండి. తిన్నవన్నీ ముందు కక్కించాలి'' అన్నారు డాక్టర్ గారు.

సుబ్బారావుకు ఆలోచన వచ్చింది. పోనీ మామ గారిని శీర్షాసనం వేయించి వీపు మీద బాదితే తిన్న వన్నీ బయటకి వస్తాయేమో కదా అని. కాని పైకి అనలేకపోయాడు.